జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 23-6-2026 శ్రీకాకుళం సంపుటి: 3 సంచిక: 708 పేజీలు: 4 వెల : రూ.7



# దువ్వాడ విచారణతో.. కొత్తూరులో.. హైడ్రామా

☀ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని గతంలో ఫిర్యాదు ☀ ఎమ్మెల్సీకి మూడుసార్లు నోటీసులిచ్చిన పోలీసులు ☀ కొత్తూరు పీఎస్‌కు అనుచరులతో వెళ్లిన దువ్వాడ శ్రీనివాస్ ☀ రాత్రి 8 గంటల వరకూ స్టేషన్‌లోనే ☀ దువ్వాడ అరెస్టు అంటూ సామాజిక మాధ్యమాల్లో వదంతులు ☀ కొత్తూరు స్టేషన్ బయట బైఠాయించిన మాధురి, అనుచరులు ☀ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు ☀ రాత్రి 8 తర్వాత బయటకు వచ్చిన దువ్వాడ

కొత్తూరు, జూన్ 22 (వార్త): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను కొత్తూరు పోలీసులు విచారణకు పిలిచారు. మూడుసార్లు నోటీసులు ఇవ్వడంతో సోమవారం విచారణ నిమిత్తం కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు దువ్వాడ హాజరయ్యారు. ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ దువ్వాడను పోలీసులు విచారణ చేయడంతో ఈ వ్యవహారంపై హైడ్రామా దారితీసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఒక టీవీ ఛానల్ చర్చా కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ హిరమండలం మండలం గొట్ట గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వంజరాపు సింహాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మార్చి 8న కొత్తూరు పోలీసులు క్రైమ్ నెంబర్ 21/2025 కింద కేసు నమోదు చేశారు. మూడుసార్లు నోటీసులు జారీ చేసిన తర్వాత సోమవారం దువ్వాడ శ్రీనివాస్ తన అనుచరురాలు దివ్వెల మాధురి, సోదరుడు దువ్వాడ శ్రీధర్ బాబుతో కలిసి మొదట హిరమండలం పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్ఐ అందుబాటులో లేకపోవడంతో కొత్తూరు స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ చింతాడ ప్రసాదరావు నేతృత్వంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి దువ్వాడను సుదీర్ఘంగా విచారించారు. విచారణ కొనసాగుతుండగానే దువ్వాడ సోదరుడు శ్రీధర్ బాబా తన సోషల్ మీడియా ఖాతాలో 'దువ్వాడ అరెస్ట్' అంటూ పోస్ట్ పెట్టడంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఆ పోస్ట్ వైరల్ కావడంతో దివ్వెల మాధురి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. సీఐ ప్రసాదరావు బయటకు వచ్చి తాము కేవలం విచారిస్తున్నామని, అరెస్ట్ చేయలేదని చెప్పినా ఆమె వినలేదు. మధ్యాహ్నం 3:45 గంటల ప్రాంతంలోనూ దువ్వాడ విచారణ కొనసాగుతోందని, అరెస్ట్ చేయలేదని సీఐ మరోసారి స్పష్టం చేశారు. దువ్వాడ శ్రీనివాస్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 353(2), 351(2)లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసినట్టు తెలిసింది. దువ్వాడ శ్రీనివాస్ సోదరుడు శ్రీధర్ బాబా స్వయంగా న్యాయవాది కావడంతో, ఆయన ఈ సెక్షన్లపై హైకోర్టు సీనియర్ న్యాయవాదుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. కాగా, రాత్రి ఎనిమిది గంటల తర్వాత దువ్వాడ శ్రీనివాస్‌ను పోలీసులు విడిచిపెట్టారు.





# ప్రభుత్వ పాఠశాలలో కుమారుడిని చేర్పించిన డీటీ



నరసన్నపేట, జూన్ 22 (వార్త): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు ఉత్తమ క్రమశిక్షణ లభిస్తుందని నమ్మకంతో నరసన్నపేట ప్రభుత్వ పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి తన కుమారుడు లజపతిరాయ్‌ను సోమవారం చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న గాయత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మంచి బోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు పెంపొందించడంలో ప్రభుత్వ పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచుకుని తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఆమె సూచించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని, అదే అనుభవంతో తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నానని చెప్పారు. విద్యార్థులకు ఉత్తమ విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి తల్లిదండ్రుల సహకారం అవసరమని, ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో సానుకూల దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉత్సవానికి వెళ్లి వస్తూ..
# అనంత లోకాలకు!

☀ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బైక్ ☀ ఇద్దరు యువకులు దుర్మరణం ☀ గోపీనాథపురం, గర్తంవానిపేట గ్రామాల్లో విషాదం ☀ కన్నీరుమున్నీరైన కుటుంబీకులు



పలాస, జూన్22 (వార్త): వజ్రపుకొత్తూరు మండలంలోని చిన్న తామాడపేట సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గోపీనాథపురం గ్రామానికి చెందిన కర్ని కోదండరావు (28), గర్తంవానిపేట గ్రామానికి చెందిన గర్తం మణికంఠ (33) కలిసి సైనూరు గ్రామంలో జరుగుతున్న అమ్మవారి ఉత్సవాలకు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని అర్ధరాత్రి సమయంలో స్వగ్రామాలకు తిరిగి బయలుదేరారు. ఈ క్రమంలో చిన్న తామాడపేట సమీపానికి చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ఒక్కసారిగా అదుపుతప్పింది. వేగంగా వెళ్తున్న బైక్ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొన్న తీవ్రత ఎక్కువగా ఉండటంతో యువకులు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో ప్రమాదం జరగడంతో కొంతసేపటి వరకు విషయం ఎవరికీ తెలియలేదు. అనంతరం అటుగా వెళ్తున్న స్థానికులు ప్రమాదాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వజ్రపుకొత్తూరు పోలీసులు మృతదేహాలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బంధువులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. యువకుల అకాల మరణంతో గోపీనాథపురం, గర్తంవానిపేట గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు కర్ని కోదండరావు కుటుంబానికి గ్రామంలో మంచి పేరు ప్రతిష్టలు ఉండగా, గర్తం మణికంఠ కూడా అందరితో కలిసిమెలిసి ఉండే వ్యక్తిగా స్థానికులు తెలిపారు. ఒకే ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడం ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

# ప్రాణం తీసిన భూ వివాదం

☀ గొల్లవూరు మహిళ మృతిలో వీడిన మిస్టరీ ☀ మృతురాలి మరిదిపై మర్డర్ కేసు

సోంపేట, జూన్ 22 (వార్త): గొల్లవూరు గ్రామంలో పిన్నింటి ఊర్వశి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ వీడింది. పోలీస్ అధికారులు చాకచక్యంగా వ్యవహరించి కేవలం రెండు రోజుల్లోనే మర్డర్ మిస్టరీని ఛేదించారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ డీఎస్పీ టి.భవాని, సీఐ బి.మంగరాజుతో కలిసి సోంపేట సర్కిల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. మృతురాలు ఊర్వశి కుటుంబానికి ఆమె మరిది సిఆర్పిఎఫ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న పిన్నింటి శివకుమార్‌కు మధ్య కొన్నాళుగా భూ వివాదం నడుస్తోంది. సుమారు మూడు నెలల క్రితం ఊర్వశి భర్త వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడిన తర్వాత ఈ వివాదాలు మరింతగా ముదిరాయి. ఊర్వశి తమ భూ వివాద వ్యవహారంలో మరిది శివకుమార్‌కు కొద్ది రోజుల క్రితం లాయర్ ద్వారా నోటీసులు కూడా పంపించింది. దీంతో శివకుమార్ ఆమెపై మరింత కక్ష పెంచుకున్నాడు. ఆమె మృతి చెందిన 18 వ తేదీ ఉదయం ఏడున్నర గంటల సమయంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఊర్వశిని చంపేస్తానంటూ శివకుమార్ బెదిరించాడు. అదే రోజు ఉదయం 9:30 గంటల సమయంలో పిల్లలు పాఠశాలలకు వెళ్లిపోయిన సమయంలో, పెద్దలు తోటలకు వెళ్లిపోయిన తర్వాత పథకం ప్రకారం శివకుమార్ ఊర్వశి ఇంట్లోకి వెళ్లి ఆమెను మంచాని కేసి కొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. అలాగే చున్నీతో ఆమె మెడను కూడా బిగించినట్లు తెలిపారు. మృతురాలి పోస్టుమార్టం రిపోర్టులో కూడా తీవ్రంగా గాయపరిచినట్లు వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు శివకుమార్‌పై హత్య కేసు నమోదు చేసి సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బారువ ఎస్సై హరిబాబు నాయుడు కూడా పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక





# ఊరికి మొనగాడు..!

**- సొంత సొమ్ముతో శ్రీముఖలింగం అభివృద్ధికి నడుం కట్టిన రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ రామసూర్యారావు**

**-అభినందిస్తున్న గ్రామస్తులు**

**'సర్పంచ్ అయితే మరింత అభివృద్ధి సాధ్యం' అంటున్న ఆ గ్రామ వాసులు**

**(జలుమూరు)**

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో సొంత సొమ్ముతో అభివృద్ధి పనులు చేపడుతూ గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నారు రిటైర్డ్ కమ్యూనికేషన్స్ ఇన్‌స్పెక్టర్ సూరా రామసూర్యారావు. అధికారిక హోదా లేకపోయినా గ్రామ అవసరాలను గుర్తించి వరుసగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఆయన మూడు నెలలుగా చురుకుగా కృషి చేస్తున్నారని స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, కుమార్తె జ్యోతి సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించారని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తాగునీటి సదుపాయం, రేకుల షెడ్ ఏర్పాటు కోసం రూ.50 వేలు ఖర్చు చేశారు. గ్రామంలోని రేవుల అభివృద్ధి, వెలమవీధి, పొందర వీధి, కళింగవీధి, బ్రాహ్మణవీధి, సూరవీధి, రెండు హరిజనవీధుల్లో రహదారుల దుస్థితిని గుర్తించి సుమారు రూ.లక్షతో తక్షణం గ్రావెల్ వేయించి తాత్కాలిక రవాణా సౌకర్యం కల్పించారు. ఈ చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి అవసరమైన పనులను ముందుండి చేపడుతున్న రామసూర్యారావు భవిష్యత్తులో సర్పంచ్‌గా బాధ్యతలు చేపడితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. గతం లో శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా రెండుసార్లు పోటీచేసిన నాయుడుగారి రాజశేఖర్, మాజీ ఉపసర్పంచ్ కర్ణ వీరుడు, ఇంజనీర్ సింహాచలం, పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సూరా రామసూర్యారావు సేవలను కొనియాడారు. గ్రామాభివృద్ధి కోసం ఆయన చూపుతున్న చొరవ ఆదర్శప్రా యమని పేర్కొన్నారు. రామసూర్యారావు కుటుంబానికి గ్రామాభివృద్ధిపై ప్రత్యేకమైన అనుబంధం ఉందని, ఆయన తండ్రి సూర్యవెంకట అప్పడు మాస్టారు కూడా గతంలో గ్రామానికి విద్యుత్ సదుపాయం తీసుకురావడంలో విశేషంగా కృషి చేశారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. తండ్రి బాటలోనే గ్రామాభివృద్ధికి కృషి చేస్తూ రామసూర్యారావు ముందుకు సాగుతున్నారని అభినందించారు. ం





## రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం



**జి.సిగడాం, జూన్ 22(వార్త):** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని గ్రామ నీటి సంఘం అధ్యక్షుడు చిత్తిరి తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు జిల్లా బీజేపీ కార్యదర్శి వజ్జపర్తి రఘురాం అన్నారు. సోమవారం ఆనందపురం రైతు సేవా కేంద్ర వద్ద రైతులకు ప్రభుత్వ సబ్సిడీతో ఉన్న నాణ్యమైన వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులను అన్ని విధాలా ఆదుకుంటూ వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా తక్షణమే స్పందించి వాటిని ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రైతులకు ప్రయోజనం కలిగే ఎటువంటి కార్యక్రమాలను చేపట్టకపోవడం ఘోరమన్నారు. రైతుల అవసరాలు తీర్చుతూ వ్యవసాయాన్ని సంపూర్ణంగా ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇటీవల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభవ-పీఎం కిషాన్ రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. దీంతో రైతులు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అనిల్, టీడీపీ సీనియర్ కార్యకర్తలు పొగిరి నారాయణరావు, పాపారావు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విత్తనాల పంపిణీలో ఇబ్బందులు తలెత్తరాదు



**జి.సిగడాం, జూన్ 22(వార్త):** విత్తనాల పంపిణీలో రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయమ్మ సూచించారు. సోమవారం పెంట గ్రామంలో మండల వరి విత్తనాలు అమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ గ్రామంలో రైతులకు ఖరీఫ్ సాగుకు అవసరమయ్యే వరి విత్తనాలను సమకూర్చామని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకరాలు బత్తిన శ్రావణి మాట్లాడుతూ ఈ విత్తనాలను కిలోకి రూ.10 చొప్పున బస్తాకి రూ.300లు సబ్సిడీతో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. టిడిపి మండల క్లస్టర్ పరిశీలికులు మక్క నారాయణరావు మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ , గ్రామ రైతన్నలకు సబ్సిడీపై పంటలను పండించేందుకు సకాలంలో ఎరువులను అందజేయాలని తెలియజేశారు. రైతులు పండించిన దాన్యం అమ్ముకునేందు ఇబ్బందులు లేకుండా ప్రతి సెంటు సెంటు నకు ఈ క్రాప్ చేసి రైతు పంటను అమ్ముకుందే కు వెసులుబాటు ఉండేలా పని చేయాలని అదికారుల దృష్టిలో పెట్టారు. కార్యక్రమంలో వీఆర్వో భూపతి నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి అల్లాడ దుర్గారావు ఎంపీటీసీ ప్రతినిధి మక్క శ్రీనివాసరావు, మక్క గోవింద, మక్క సూరిబాబు,ఈ మీసాల రమణ, డోల పార్వతి, పున్నాన అక్కలనాయుడు, సిగ డాపు గోవిందరావు, డోల రామారావు, మక్క లక్ష్మణ, మక్క వైకుంఠరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో రైతులకు లాభం



**మెళియాపుట్టి, జూన్ 22(వార్త):** పంట మార్పిడి విధానంతో రైతులు ఎక్కువగా లాభపొందవచ్చని, ఈ విధానంపై రైతులు దృష్టి సారించాలని మెళియాపుట్టి వీఏఏ ఆర్.జరిత అన్నారు. రైతన్న- మీకోసంలో భాగంగా సోమవారం మెళియాపుట్టిలో జరిత ఆధ్వర్యంలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె ఏపీ ఏఐఎంఎస్/ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ ద్వారా రైతులకు సులభతరంగా (యూరియా, డీఏపీ) ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేసే విధానాన్ని, సూక్ష్మ నీటి సాగుపద్ధతులు, ప్రకృతి వ్యవసాయ విధానాలను తెలియపరిచారు. కార్యక్రమంలో టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనపాన రాజశేఖర్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు బస్వ పరమేశ్వర రెడ్డి, కాళ్ల కృష్ణారావు, బోను రామారావు పారమ్మ, బోను కృష్ణారావు, బోను రాజారావు, కాళ్ల లచ్చుము, బోను ఢిల్లీరావు, జర్జపు సూరి, కాళ్ల రమణ, రైతులు పాల్గొన్నారు.


## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**సోంపేట, జూన్ 22(వార్త):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనారోగ్య బాధితులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ పేర్కొన్నారు. ఆయన క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం పలు మండలాలకు చెందిన అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కింద అవకాశం లేని వ్యాధులను ప్రైవేటుగా నయం చేసుకున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. కంచిలి మండలానికి సంబంధించి పలువురు బాధితులకు మూడు లక్షల ఒక వెయ్యి 91 రూపాయలు చెక్కుల రూపంలో అందజేశారు. లమ్మత అప్పలరాజు, గోలియా మహాలక్ష్మి, భూదేవి దొళాయి, నిమ్మన రాకేష్ లకు సహాయం అందించారు. సోంపేట మండలం చేపల గొల్లగండి గ్రామానికి చెందిన డి.గంగయ్యకు 61000 రూపాయలు చెక్ రూపంలో అందజేశారు. కార్యక్రమాల్లో కంచిలి మండలం టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు, నిట్ట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధే లక్ష్యం





**జి.సిగడాం, జూన్ 22(వార్త):** గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి, పేదరిక నిర్మూలన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకులు గ్రామ నీటి సంఘ అధ్యక్షుడు మీసాల విజయలక్ష్మి అన్నారు. సోమవారం టీడీపీ క్లస్టర్ పరిశీలకులు మక్క నారాయణ రావు, మక్క సూరిబాబు పెంట పంచాయతీ ఎస్సీ కాలనీలో పర్యటించారు. స్థానికులను, కార్యకర్తలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు కాలువలు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు, మౌళిక సదుపాయాలు, వసతుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన వెంటనే స్పందిస్తూ ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు దృష్టికి వీటిని తీసుకెళ్లారు. గ్రామ అభివృద్ధికి వసతులపై ఎమ్మెల్యే, ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఆ వెంటనే వీధి దీపాలను వేయించారు. మిగతా అంశాలపై చర్యలు తీసుకొని అభివృద్ధి చేస్తామని చెప్పారు. వీరి వెంట కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చింది

**- వలస కూలీలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరం**

**-గొటివాడలో వేతనదారులతో కాంగ్రెస్ ఇన్‌చార్జి నరసింహమూర్తి**

**జలుమూరు, జూన్ 22(వార్త):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ప్రవేశపెట్టారని నరసన్నపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి మంత్రి నరసింహామూర్తి అన్నారు. సోమవారం జలుమూరు మండలం గోటివాడ గ్రామంలో పర్యటించిన ఆయన ఉపాధి హామీ వేతనదారులతో సమావేశమై వారి సమస్యలు, వేతనాల చెల్లింపులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన మంత్రి నరసింహామూర్తి, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం, వలసలను తగ్గించడం, కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం వంటి లక్ష్యాలతోనే ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేని సమయంలో ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు ఏ మేరకు వేతనాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్న ఆయన, చెల్లింపుల్లో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ కార్మికులు, ముఖ్యంగా వలస కూలీలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అర్హులైన వారికి చేరినప్పుడే వాటి ఉద్దేశం నెరవేరుతుందని, ఉపాధి హామీ పథకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తోందని ఆయన తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.



## మంచి అవగాహనతోనే ఉత్తమ వ్యవసాయం




**కంచిలి, జూన్ 22(వార్త):** ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు మంచి అవగాహనతో ఉత్తమమైన వ్యవసాయాన్ని చేపట్టవచ్చని మండల వ్యవసాయ అధికారి కొంక్యాన సురేష్ పేర్కొన్నారు. బొగాబని గ్రామం రైతు సేవా కేంద్రం పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్థానిక రైతు కుటుంబాలను కలిపి ఏ పి ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా ఈ ఏడాది యూరియా,డి ఏ పి ఎరువులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యూరియా వాడకాన్ని విచక్షణ రహితంగా ఉపయోగించకుండా మట్టి నమూనా విశ్లేషణ పత్రములో సిఫార్సు చేసిన మేరకు వాడాలని అన్నారు. అలాగే సేంద్రియకర్బణం భూమిలో పెంచే విధంగా చివికిన పశువుల ఎరువు, కోళ్ల ఎరువు,పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను తట్టుకునే అపరాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు పంటలు వేసుకోవాలని సూచించారు. యూరియా, డిఏపి స్థానంలో నానో యూరియా, నానో డీఏపీలను డ్రోన్ ద్వారా పిచికారి చేయడం వలన మొక్కకు అవసరమైన నత్రజని, భాస్వరం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ పైల పురుషోత్తం రెడ్డి, జీవిత,పలువు రైతులు పాల్గొన్నారు.

## చురుగ్గా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ



**జి.సిగడాం, జూన్ 22(వార్త):** ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. సోమవారం పెంట-1,2 పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు భూపతి నర్సింగ రావు, దుర్గారావు ఆధ్వర్యంలో ఇరు పార్టీల నాయకులు సమక్షంలో జాబితా పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మక్క నారాయణరావు, అక్కలనాయుడు, మక్క సూరిబాబు, మక్క రామగోవిందరావు, వీఆర్ఏ పన్నీరు బాలకృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు మక్క విజయలక్ష్మి, మక్క రూపావతి, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద ప్రమాదం... చిన్ని సహాయం!!

**- సీఎం సహాయ నిధిపై పెదవి విరుపు**

**సోంపేట, జూన్ 22 (వార్త):** ఆరోగ్యం ప్రమాదంలో పడినప్పుడు ఆపన్న హస్తం అందించే ఎన్టిఆర్ ఆరోగ్య సేవా పథకం అవకాశం లేనప్పుడు అనేకమంది అనారోగ్య బాధితులు ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయించడం తప్పని పరిస్థితి. ఇటువంటి బాధితులకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి కొంత సహాయాన్ని అందించి ఆసరాగా నిలుస్తుంది. ప్రైవేటుగా పెద్దమొత్తం విధుల్చుకునే బాధితులు ప్రభుత్వ సహాయం కోసం ఎంతో ఎదురు చూస్తుంటారు. ఈ పరిస్థితుల్లో కొంతమందికి అందే నామ మాత్రపు ప్రభుత్వ సహాయం పట్ల అనేకమంది పెదవి విరుస్తున్నారు. బారువా గ్రామానికి చెందిన దుమ్ము స్నేహిత అనే బాలిక గత ఏడాది మే నెలలో పాలవలస గ్రామంలో జరిగిన సంబరాలకు వెళ్లి అనారోగ్యం బారిన పడింది. డేయోరియా బారిన పడి తీవ్ర అనారోగ్య సమస్యను తెచ్చుకుంది. సోంపేట ప్రభుత్వ వైద్యులు పరిస్థితి క్రిటికల్ అంటూ పేర్కొన్నారు. పలువురు సలహాతో ఇచ్చాపురం లో గల అందుబాటులో ఉన్న అదునాతన వెంటిలేటర్ సదుపాయాలు గల డాక్టర్ సురేష్ రెడ్డి హాస్పిటల్ కి తరలించారు. అక్కడ సుమారు నెల రోజులు వైద్యం పొందింది. చివరకు ప్రాణాపాయ పరిస్థితి నుంచి గొట్టెక్కింది. స్నేహిత నెలరోజుల వైద్యానికి 11 లక్షల 98 వేల రూపాయలు ఆసుపత్రి ఖర్చులు చెల్లించారు. ఈ నేపథ్యంలో సగం మొత్తం అయినా వస్తుందని ఆశించిన బాదిత కుటుంబానికి సోమవారం ఇచ్చిన కేవలం లక్ష 74 వేల రూపాయలు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వివిధ మండలాల్లో విపరీతమైన తేడాలు ఉన్నాయంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. కంచిలి మండలంలో బాధితులకు పెద్ద మొత్తాల్లో చెల్లించి మిగతా మండలాల్లో బాధితులకు మాత్రం కంటి తుడుపు చెల్లింపులు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది నిజమైన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే అశోక్ ను పలువురు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆరు నెలలకే.. పగుళ్లు!

- బీటలు వారుతున్న పెద్దలంబ-పురుషోత్తమపురం రహదారి
- రూ.75 లక్షలతో నిర్మించిన రోడ్డు నాణ్యతపై ప్రజల్లో అనుమానాలు
- మరమ్మతులు చేపడతామని మండల ఇంజినీర్ హామీ

(సారవకోట )

పెద్దలంబ నుంచి పురుషోత్తపురం గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణం పూర్తై ఆరు నెలలు గడవకముందే పగుళ్లు రావడం స్థానిక ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తోంది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.75 లక్షల వ్యయంతో 1.70 కిలోమీటర్ల మేర ఈ రహదారిని నిర్మించగా, తక్కువ కాలంలోనే దెబ్బతినడంతో పనుల నాణ్యతపై సందేహాలకు తావిస్తోంది. గ్రామాల మధ్య రాకపోకలకు కీలకంగా ఉన్న ఈ రహదారి నిర్మాణం పూర్తయ్యాక కొద్ది నెలలకే పలుచోట్ల పగుళ్లు కనిపిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. కొత్తగా వేసిన రోడ్డు ఇంత త్వరగా దెబ్బ తినడం నిర్మాణ ప్రమాణాలపైనా, పర్యవేక్షణపైనా ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ రహదారి ద్వారా పెద్దలంబ, పురుషోత్తపురం గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో పాటు వ్యవసాయ అవసరాలకూ వినియోగిస్తున్నారు. అలాంటి రహదారి తక్కువ కాలంలోనే దెబ్బతినడం వల్ల భవిష్యత్తులో మరింత నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మండల ఇంజినీర్ భార్గవిని వివరణ కోరగా, రహదారిలో ఏర్పడిన పగుళ్లను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపడతామని తెలిపారు. సమస్యను గుర్తించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు మాత్రం నిర్మాణ నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి, లోపాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు దీర్ఘకాలం ఉపయోగపడేలా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## 24 నుంచి శ్రీముఖలింగేశ్వర వార్షిక కళ్యాణ దివ్యోత్సవాలు

- ఆరు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి
- ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర్



**జలుమూరు, జూన్ 22(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో వారాహి సమేత శ్రీముఖలింగేశ్వర స్వామివారి వార్షిక కళ్యాణ దివ్యోత్సవాలు ఈ నెల 24నుంచి 29వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ప్రధాన అర్చకులు, అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాయుడుగారి రాజ శేఖర్ తెలిపారు. బుధవారం రాత్రి 7 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 25న రాత్రి 9 గంటలకు వారాహి సమేత శ్రీముఖలింగేశ్వర స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని నంది వాహనంపై తిరువీధి ఉత్సవం అనంతరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా పౌర్ణమి వరకు పలు ఆధ్యాత్మిక, వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న అన్నసంతర్పణతో పాటు లోక కళ్యాణార్థం ఆగ్నేయ స్థాలీపాక హోమం, 27న బలిహరణ, ఉపాసన, విశేష పుష్పార్చన కార్యక్రమాలు ఉంటా యని వివరించారు. 28న పండిత సదస్సు, సత్కార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా 29న వసంతోత్సవం, వంశధార నదిలో త్రిశూల చక్రతీర్థ స్నానం, అనంతరం ధ్వజా వరోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దివ్యోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. దేవస్థానంలో నిర్వహించనున్న ఈ వార్షిక ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయని, పరిసర ప్రాంతాల భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి




**జలుమూరు, జూన్ 22(వార్త):** సర్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి జయదేవి ఆదేశించారు. సోమవారం జలుమూరు తహాశీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్వైజర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా ప్రతి ఇంటికి చేరుకుని ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం ఎంతో ముఖ్యమని, ప్రతి ఓటరు వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,16,975 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 1,13,910 ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు జయదేవి వెల్లడించారు. మిగిలిన ఫారాల పంపిణీ మరియు సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి సమయానికి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా ప్రతి స్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచిచారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ల జాబితా కీలకమైందని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు, బీఎల్ఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**నరసన్నపేట, జూన్ 22 (వార్త):** యువత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల పట్ల ఆకర్షితులవడం ఆందోళనకరమని, అలాంటి అలవాట్లు జీవితాలను నాశనం చేసే ప్రమాదం ఉందని ఎక్సైజ్ సీఐ టీ. వెంకటప్పల నాయుడు హెచ్చరించారు. సోమవారం నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ సప్తాహ్' కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డ్రగ్స్, మద్యం, ఇతర మత్తు పదార్థాల వాడకం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ, సామాజిక జీవితాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. క్షణికానందం కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ దెబ్బతినే ప్రమాదం ఉందని చెప్పారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండడంతో పాటు స్నేహితుల్లో ఎవరైనా అలాంటి అలవాట్లకు లోనవుతున్నట్లు గమనిస్తే వారిని కూడా చైతన్యపరచాలని కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దల పట్ల గౌరవభావంతో మెలగడం ద్వారా మంచి వ్యక్తిత్వం అలవడుతుందని పేర్కొన్నారు. యువత సరైన మార్గంలో నడిస్తేనే సమాజం ఆరోగ్యకరమైన దిశగా ముందుకు సాగుతుందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించాలి



**జలుమూరు, జూన్ 22(వార్త):** విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలు, భాషా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఉపాధ్యాయులకు జలమూరు మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) బమ్మిడి మాధవరావు సూచించారు. సోమవారం జలమూరు మోడల్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించిన ఎంఈవో, విద్యార్థులకు డిక్టేషన్ ఇచ్చి వారు ఎలా రాస్తున్నారో స్వయంగా గమనించారు. విద్యార్థులు డిక్టేషన్‌ను పూర్తి చేసిన తీరు, వారి స్పందనను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న వయస్సు నుంచే చదవడం, వినడం, రాయడం వంటి ప్రాథమిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఇటువంటి శిక్షణాత్మక ప్రక్రియలను అలవాటు చేస్తే భవిష్యత్తులో వారి విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని మాధవరావు అభిప్రాయపడ్డారు. ప్రతి విద్యార్థి నేర్చుకునే స్థాయిని గుర్తించి, బలహీనంగా ఉన్న అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు విద్యార్థుల వ్యక్తిగత నైపుణ్యాలను గుర్తించి అభివృద్ధి చేయడం కూడా సమానంగా అవసరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే దిశగా ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా మూల్యాంకన పద్ధతులను అమలు చేయాలని సూచించారు.

## చట్టాలపై కార్మికులకు అవగాహన ఉండాలి




**పలాస, జూన్ 22(వార్త):** చట్టాలపై కార్మికులకు అవగాహన కలిగి ఉండాలని అదనపు జడ్జి కే హరిబాబు సూచించారు. సోమవారం పలాస కేజీ లేబర్ యూనియన్ కార్మికులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి ఆదేశాల మేరకు సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి హరిబాబు మాట్లాడుతూ ఈ-శ్రామిక్ యాప్ ద్వారా ప్రతి ఒక కార్మికుడు కార్మిక శాఖ అధికారి వారి సహకారంతో ప్రభుత్వం అందించే పథకాలు తెలుసుకొని లబ్ధి పొందాలని తెలియజేశారు. అసంఘటిత కార్మికులకు న్యాయసహాయం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందించే వివిధ సదుపాయాలను గురించి కార్మికులను చైతన్య వంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాద బీమాను కూడా చేసుకొని ఎవరికైనా ప్రమాదం జరిగినట్లయితే నష్టపరిహారం కూడా పొందవచ్చని తెలియజేశారు. ఒకవేళ ఏ కార్మికుడైన అనుకోకుండా ప్రమాదంలో మరణించినచో వారి కుటుంబాలకు నష్ట పరిహారం అందుతుందని తెలియజేశారు. షెడ్యూల్ క్యాస్ట్, తెగలకు, మానసిక వికలాంగులకు మూడు లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి అందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందని, ఉచిత న్యాయ సహాయానికై 15100 నెంబర్కు సంప్రదించవచ్చనని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ విజయ్‌కుమార్, కాశీబుగ్గ ఎస్ఐ సునీల్, లేబర్ యూనియన్ నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు. అనంతరం ఆయన స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు అక్కడ విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ వారికి అందిస్తున్న వసతి, భోజనం, వైద్య సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సందర్శించి అక్కడ న్యాయవాదులతోనూ, పోలీస్ ఆఫీసర్లతోను, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ వారితోను ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే నెల జరగబోయే జాతీయలోక్ ఆదాలత్ లో తమవంతు పాత్ర పోషించి, కక్షిదారులతో మాట్లాడి కేసులు రాజుకి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.



## పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

- 2,723 మంది చిన్నారులు గుర్తింపు
- 18 కేంద్రాల ఏర్పాటు



**జలుమూరు, జూన్ 22(వార్త):** పల్స్ పోలియో విజయవంతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని జలుమూరు ఎంపీడీవో చిన్నమ్ముడు, వైద్యులు సుజాత, అహల్య కోరారు. సోమవారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య శాఖ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొని కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. ఈనెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియోకి సంబంధించి ఇప్పటికే విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. మండల పరిధిలో 2,723 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించినట్లు వెల్లడించారు. వీరందరికీ పోలియో చుక్కలు అందించేందుకు 18 బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సకాలంలో హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులను చైతన్యపరచాలని అంగన్వాడీ, ఆశా కార్యకర్తలకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. సమావేశంలో ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




**పోలాకి, జూన్22 (వార్త):** ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి డా.రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన అధ్యక్షతన పల్స్ పోలియో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రవికుమార్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. గ్రామాలు, కాలనీలు, దూరప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు ముందుగానే సమాచారం అందించి పిల్లలను పోలియో బూత్‌లకు తీసుకురావాలని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని, పోలియో నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గ్రామస్థుల సహకారంతో కరగాంలో పార్కు



**నరసన్నపేట, జూన్ 22 (వార్త):** కరగాం గ్రామంలో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన పార్కును ఎస్ఐ బి. గణేశ్ ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ఇలాంటి కార్యక్రమాలు గ్రామానికి అందాన్ని తీసుకురావడమే కాకుండా సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి. గణేశ్ మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. పార్కులు, క్రీడా మైదానాలు, పాఠశాలలు వంటి ప్రజా అవసరాల సదుపాయాల అభివృద్ధికి గ్రామస్థులు, దాతలు కలసికట్టుగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. పార్కు ఏర్పాటుకు సహకరించిన రావాడ చిరంజీవిని ఎస్ఐ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామాభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు రావాలని ఎస్ఐ పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలి

**పలాస, జూన్ 22 (వార్త):** రాష్ట్రంలో మద్యం వినియోగం కారణంగా మహిళలు, పిల్లలు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. మద్యం వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటుండటంతో పాటు మహిళలపై హింస, కుటుంబ కలహాలు, రోడ్డు ప్రమాదాలు, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, మహిళల భద్రత, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని సంఘం డిమాండ్ చేసింది. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టి, బార్లు, మద్యం దుకాణాలపై కఠిన పర్యవేక్షణ చేపట్టాలని కోరింది. పలాస పట్టణంలో బార్ల నిర్వహణపై వస్తున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. మహిళల, పిల్లల భద్రత, కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# ఇండోర్ తెరిచేదెన్నడు?

- ప్రారంభానికి నోచుకోని నరసన్నపేట ఇండోర్ స్టేడియం
- రూ.2.55 కోట్లతో నిర్మాణం పూర్తైనా అందుబాటులోకి రాని ఎన్టీఆర్ క్రీడా వికాసం భవనం
- ప్రారంభోత్సవం కోసం ఎదురు చూస్తున్న క్రీడాకారులు, ప్రజలు

(నరసన్నపేట)

నరసన్నపేటలోని నరసన్న చెరువు సమీపంలో 'ఎన్టీఆర్ క్రీడా వికాసం' పేరుతో నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభానికి నోచుకోకపోవడంతో క్రీడాకారులు, యువత, స్థానిక ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ, స్టేడియం ఇప్పటికీ వినియోగంలోకి రాకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా 2018లో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించారు. మొదట రూ.2.10 కోట్ల వ్యయంతో పనులు చేపట్టగా, అనంతరం అదనంగా మరో రూ.45 లక్షలు మంజూరు చేయడంతో మొత్తం వ్యయం రూ.2.55 కోట్లకు చేరింది. అవసరమైన నిధులు సమకూరడంతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం గమనార్హం. ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వస్తే బ్యాడ్మింటన్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ వంటి ఇండోర్ క్రీడలకు ప్రోత్సాహం లభించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు మెరుగైన సాధన వేదికగా ఉపయోగపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా నరసన్నపేట పట్టణం, పరిసర గ్రామాల యువతకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారే అవకాశం ఉన్నప్పటికీ, ప్రారంభంలో జాప్యం కారణంగా స్టేడియం ప్రయోజనం ప్రజలకు అందడం లేదు. స్టేడియం నిర్మాణం పూర్తై చాలా కాలం గడిచినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభంపై స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒకవైపు క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు సిద్ధంగా ఉన్న క్రీడా వసతులను వినియోగంలోకి తేవడంలో నిర్లక్ష్యం ఎందుకు అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక యువత, క్రీడాభిమానులు కోరుతున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ క్రీడా సముదాయం నిరుపయోగంగా మిగలకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రాంతీయ ఆసుపత్రి ట్రాన్స్‌ఫార్మర్‌కు

# ముళ్ల తీగల ముప్పు..!

- విద్యుత్ అంతరాయాలపై స్థానికుల ఆందోళన
- వర్షాకాలానికి ముందే తొలగించాలని విజ్ఞప్తి



**నరసన్నపేట, జూన్ 22 (వార్త):** నరసన్నపేట ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ముళ్ల తీగలు అల్లుకుపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల్లో పెరిగిన ముళ్ల తీగలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించే అవకాశముందని చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తడి వాతావరణం, గాలివానల కారణంగా ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఆసుపత్రి వంటి అత్యవసర సేవల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండటం అత్యంత కీలకమని, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇలాంటి పరిస్థితులు నిర్లక్ష్యం చేయరానివని ప్రజలు అంటున్నారు. రోగుల చికిత్స, అత్యవసర వైద్య సేవలపై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న ముళ్ల తీగలను తొలగించి, పరిసర ప్రాంతాన్ని శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలానికి ముందే ప్రమాదకర పరిస్థితులను నివారించి విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రక్తదాతలకు సన్మానం



**ఇచ్ఛాపురం, జూన్ 22(వార్త):** సామాజిక న్యాయం, సమాజ హక్కుల కోసం రాష్ట్ర నవచైతన్య బహుజనుల సంఘం కార్యాలయ ప్రారంభం శ్రీకాకుళంలోని రాయ్ లేఔట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇచ్ఛాపురంనకు చెందిన పాతిర్ల గిరిబాబు రెడ్డి, అనపాన శ్రీరామ్ రెడ్డి, పలాస ప్రాణాదాత బ్లడ్ బ్యాంక్ సాయి మహంతిని రాష్ట్ర అధ్యక్షులు ఓంపురు రమేష్, రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల అప్పన్న సత్కరించారు. కార్యక్రమంలో శ్రీలంక బౌద్ధ మత గురువు బోధిహీన్,న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ అధినేత తొత్తడి మణికంఠ, ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సాయి మహంతి పాల్గొన్నారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రోడ్డు ప్రమాదం


# ఒకరి దుర్మరణం

**పలాస, జూన్ 22 (వార్త):** పలాసలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి దుర్మరణం పాలయ్యాడు. స్థానికుల వివరాల మేరకు మున్సిపల్ వీధికి చెందిన కుమ్మరి రామారావు రోడ్డుపై వెళ్తుండగా అక్కడ ఆగి ఉన్న మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ప్రమాదాన్ని గమనించిన సమీపంలోని ఆటో యూనియన్ సభ్యులు వెంటనే స్పందించి తీవ్రంగా గాయపడిన రామారావును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. రామారావు మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. స్థానికులు కూడా ఈ ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




# భారత్ గ్యాస్ బండబడ

- సిలిండర్ పై రూ.60 అదనపు వసూలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యం ఆడిందే ఆట..పాడిందేపాట



Bharatgas
SRI SATYA SAI GAS AGENCIES BHARATGAS DISTRIBUTORS
GST Invoice
Order Number: 37041 — Order Date: 13/06/2026
Invoice Number: 51852 — Invoice Date: 19/06/2026
GSTIN: 37ALYPK2766J1Z9 — State Code: 11
Consumer
Consumer Name: YASODA TALAGANA
Mobile Number: 9849414766 — DGCC No: 1458942
Consumer Number: 54996 — LPG ID: 10000000030018621
Consumer Address: W/O RAJA RAO PURUSHOTTAPURAM PARASAMBA (KASIBUGGA)
Product Details
LPG 14.2 KG (NS-DOM) — Qty: 1
HSN: 271119
BASE RATE — Rs. 925.72
DELIVERY CHARGES — Rs. 0.00
NET BASE RATE — Rs. 925.72
CGST (2.50%) — Rs. 23.14
SGST (2.50%) — Rs. 23.14
NET — Rs. 972.0
Subsidy Quota Consumed: 1/12
Mandatory Inspection Due: N — Suraksha Due: N
EMERGENCY LEAKAGE TOLL FREE NUMBER: 1906
1. Pre delivery inspection is must, always insist upon our delivery boy to break open the seal and check the cylinder for defect/leakage. Recap the cylinder before accepting.
2. If you doubt the quantity of gas in the cylinder, please insist on having it weighed before accepting the delivery.
3. Get the installation checked/serviced only by our authorized mechanic and not by deliveryman or an outsider.
4. Insist on a cash memo if any amount is paid.
5. Extinguish all open flames, while changing the cylinder or servicing the appliances.
6. For your family's safety use Bharatgas Suraksha Hose and replace your Suraksha hose in every 5 years.
7. Switch off the regulator when not in use.
8. In case of any accident involving LPG installation, customer must intimate Bharatgas distributor immediately. We have taken PLI Policy to cover loss of life/property and medical expense in case of accident caused primarily by leakage of LPG at registered premises.
9. Please do not hand over your empty or leak cylinder to anyone without on-the-spot replacement with a full cylinder.
10. If you smell LPG Switch off the regulator. Do not switch ON/OFF any electrical equipment as it may cause spark. Please contact 1906.
11. M.R.T.P Notification: While you are welcome to purchase cooking appliances or other products available with us, we would like to make it clear that it is not obligatory for you to purchase the same from us.You are at liberty to buy cooking appliances or other products
1. Now you can book and pay through our HELLO BPCL APP available in Google play store /Apple app store.
2. Kindly insist on Mandatory inspection of your installation in every 5 years for your own safety.
Disclaimer: This is a system generated invoice and does not require signature.

**పలాస, జూన్ 22(వార్త):** భారత్ గ్యాస్ కావాలంటే అమ్మో అంటూ వినియోగదారులు గుండెలు బాదుకుంటున్నారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో వినియోగదారుల నుంచి ఒక్కో గ్యాస్ బండపై 60 రూపాయలు చొప్పున అదనపు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తం ఎవరి జోబులోకి వెళ్తుందో అంటూ వినియోగదారులు చర్చించుకుంటున్నారు. సిలిండర్ డెలివరీకి అధికారికంగా నిర్ణయించిన ధర సుమారు రూ.973 చెల్లించాల్సి ఉండగా, గ్యాస్ డెలివరీ బాయ్ అదనంగా 60 రూపాయలు




తీసుకుంటున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తాన్ని నేరుగా డిజిటల్ చెల్లింపు రూపంలో తీసుకుంటున్నట్లు కొందరు వినియోగదారులు చెబుతున్నారు. జంట పట్టణాల్లో సుమారు 5వేల కనెక్షన్లు ఉన్నాయని ప్రతి సిలిండర్ కు 60 రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నట్లయితే నెలకు సుమారు లక్షల రూపాయల మేరకు వినియోగదారులపై అదనపు భారం పడుతుందని స్థానికులు అంటున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలో మరింత అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అదనపు చార్జీలు గురించి ప్రశ్నిస్తే వినియోగదారులకు సరైన సమాధానం ఇవ్వకుండా గ్యాస్ బాయ్ ఇవ్వాల్సిందేనని ధోరణిలో మాట్లాడుతున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా అదనపు మొత్తం చెల్లించేందుకు నిరాకరించిన వారికి బుకింగులు ఆలస్యం చేయడం లేదా ఇబ్బందులకు గురి చేస్తున్నారన వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర ఒకటి... గ్యాస్ డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్న ధర మరొకటి... అదనంగా తీసుకుంటున్న 60 రూపాయలకు అధికారిక రసీదు ఉందా? ఆ డబ్బు ఎవరి జేబులోకి వెళ్తుందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్ శాఖ అధికారులు తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వినియోగదారుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై భారత్ గ్యాస్ యాజమాన్యం వివరణ కోరెందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు అంటూ సిబ్బంది సమాధానం దాటవేశారు.

# అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

## రూ.25 లక్షల విలువైన

## 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**పలాస, జూన్ 22 (వార్త):** అంతర్రాష్ట్ర దొంగను కాశీబుగ్గ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని శ్రీకాకుళం ఏఎస్పి శ్రీనివాస రావు వెల్లడించారు. సోమవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మూడు బైక్ దొంగతనాలు సహా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన మొత్తం 11 దొంగతనాల కేసులను ఛేదించిన కాశీబుగ్గ పోలీసులు దొంగను అరెస్ట్ చేసి, రూ.25 లక్షల విలువైన 13 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నాతమిరి రఘునాధన్ పెదంచల గ్రామం, రెంటికోట పోస్టు, పలాస మండలానికి చెందిన వ్యక్తిని చెప్పారు. ఇంటర్ వరకు చదివిన రఘునాధన్ అనంతరం వెల్డింగ్ పనులు నేర్చుకొని బెంగళూరు, అబుదాబి ప్రాంతాల్లో పనిచేశాడు. 2019లో స్వగ్రామానికి తిరిగి వచ్చి, అనంతరం విశాఖపట్నం పరవాడ ప్రాంతంలోని ఫార్మా కంపెనీలో 2021 వరకు వెల్డర్‌గా పని చేశాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన అతడు బైక్ దొంగతనాలకు పాల్పడుతూ వాటిలో కొన్నింటిని విక్రయించి, మరికొన్నింటిని స్వయంగా వినియోగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. కాశీబుగ్గ





పోలీస్ స్టేషన్‌లో పలాసలోని వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న కొర్రాయి షణ్ముఖరావు శ్యామసుందరరావు (39) ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్ సైకిల్‌ను మే 30న రాత్రి తాళం విరగగొట్టి దొంగిలించాడన్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టిన కాశీబుగ్గ సీఐ ఎన్ని రామకృష్ణకు అందిన సమాచారం మేరకు కంబరిగాం జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. బుల్లెట్‌పై సంచరిస్తున్న రఘునాధన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, వివిధ ప్రాంతాల్లో చేసిన బైక్ దొంగతనాల నేరం అంగీకరించారని తెలిపారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, నరసన్నపేట, ఆమదాలవలస, విజయనగరం వన్‌టౌన్, అనకాపల్లి, విశాఖ హార్బర్, పరవాడ, మల్కాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కోటి చొప్పున, ఒడిశా రాష్ట్రంలోని జరడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనాలకు సంబంధించిన 13 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ, ఎస్సైలు సునీలు, ఆర్ నరసింహమూర్తి, మందస సిఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషించారు. నిందితుడిని అరెస్టు చేసి కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి అవార్డులు ప్రకటించారు.

# బోన్‌మ్యారో బాధితురాలికి పింఛను మంజూరు చేయండి

**ఇచ్ఛాపురం, జూన్ 22(వార్త):** డొంకూరు గ్రామానికి చెందిన దున్న సమీర బోన్‌మ్యారో కాన్సర్‌తో బాధపడుతున్నా.. పింఛన్ మంజూరు కాలేదని వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కలెక్టర్‌కు విన్న వించారు. సోమవారం ఆయన కలెక్టర్‌ను గ్రీవెన్స్‌లో కలిసి సమస్యను విన్నవించారు. పెన్షన్, వైద్య సహాయం అందించాలని కోరారు. ఉద్దాన ప్రాంతం లోని విద్యార్థులకు ప్రతీ 6 నెలలకు కిడ్నీ వ్యాధి పరీక్షలు నిర్వహించాలని, తలసేమియా వ్యాధిగ్రస్తులకు టెస్టింగ్ సెంటర్ పూర్తిస్థాయిలో అందుబాటు లోకి తీసుకురావాలని అభ్యర్థించారు. పురుషోత్తపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు డాక్టర్‌ను నియమించాలని కోరారు. ఇచ్ఛాపురం బీసీ హాస్టల్ విద్యార్థులకు మంచినీటి సదుపాయం, మున్సిపాలిటీ వాటర్ సప్లై పైప్ లైన్ హాస్టల్‌కు అనుసంధానం, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సోంపేట, బారువ పశువుల ఆసుపత్రి నందు వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. జింకిభద్ర, బెంకిలి పరిసర గ్రామాల్లో అకాల వర్షా లకు టమోటా పంట నష్టం జరిగిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. బారువ సచివాలయం-2 నందు



సేవలు అందుబాటులోకి తీసుకొని రాగలరని కోరారు. కవిటి మండలం, పెద్ద కర్రివానిపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో వలలు, బోట్ నష్టపోయి, జీవనాధారం కోల్పోయిన మత్యకారులందరికీ ప్రభు త్వ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సోంపేట జడ్పీటీసీ ప్రతినిధి తడక జోగారావు పాల్గొన్నారు.

## ఏడేళ్ల చెత్తకు విముక్తి.. కేసుపురం చిన్న గెడ్డకు మోక్షం



**ఇచ్ఛాపురం, జూన్ 22 (వార్త):** ఏడేళ్లుగా చెత్త కుప్పలతో దుర్గంధభరితంగా మారిన కేసుపురం గ్రామ సమీపంలోని చిన్నగెడ్డకు ఎట్టకేలకు విముక్తి లభించింది. పాలకుల నిర్లక్ష్యంతో సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను కేసుపురం పంచాయతీ టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఉత్తమ కార్యకర్త గుజ్జు భీమరాజు చొరవ తీసుకుని జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగింపజేశారు. దీంతో గ్రామ ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించింది. కేసుపురం గ్రామంలో చెత్తను పారవేసేందుకు ప్రత్యేకంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో గ్రామంలో సేకరించే చెత్తను చిన్నగెడ్డ వద్దనే వేస్తూ వచ్చారు. కాలక్రమేణా అక్కడ భారీగా చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించడమే కాకుండా దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారింది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉండేదని గ్రామస్థులు తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన గుజ్జు.భీమరాజు గ్రామ ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని పంచాయతీ ప్రత్యేక అధికారి, కార్యదర్శి కోటేశ్వరరావుతో చర్చలు జరిపారు. అనంతరం అధికారుల సహకారంతో జేసీబీని ఏర్పాటు చేసి చిన్నగెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. దీంతో ఏళ్ల తరబడి పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యకు ముగింపు పలికిన భీమరాజును గ్రామ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో పిట్ట పురుషోత్తం రెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు పిట్ట రామారావు, బుడత.తిరుపతి, మన్యాల.జానకిరావు, గ్రామనాయుడు సూరు.కామరాజు, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సేవల ప్రైవేటీకరణపై కార్మికుల నిరసన




**పలాస, జూన్ 22 (వార్త):** మున్సిపాలిటీల్లో సేవలను పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం. 975, 673లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్మికులు సోమవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకటి, బి.కుర్మారావు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో శాశ్వత స్వభావం గల పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు 2016 తీర్పు మేరకు "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలని, హైకోర్టు ఆదేశాల ప్రకారం మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 2011-12 సంవత్సరాలకు సంబంధించిన 20 నెలల పీఎఫ్ బకాయిలను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని, 2024లో చేపట్టిన ఏడు రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను చెల్లించాలని కోరారు. పదవీ విరమణ చేసిన లేదా మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కె. ఈశ్వరరావు, అమర్, రజేష్, రాము, రవి, బాలరాజు, ప్రకాష్ ముఖి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# జామియా మజీద్‌లో భాషా హ్యాట్రిక్

- మూడోసారి అధ్యక్షుడిగా ఎస్.కే. భాషా ఏకగ్రీవ ఎన్నిక
- కార్యదర్శిగా వరుసగా మూడోసారి ఎస్.కే. బషీర్‌కు బాధ్యతలు



**పలాస, జూన్ 22 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ ప్రార్థనా మందిరం జామియా మజీద్ కమిటీ ఎన్నికలు ఐక్యత, సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. మజీద్ అభివృద్ధి, ముస్లిం కుటుంబాల సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలు అందించిన ఎస్.కే. భాషాను వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా, ఎస్.కే. బషీర్ ను వరుసగా మూడోసారి కార్యదర్శిగా సున్నతుల్ జమాత్ కుటుంబాల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికలు జరగడం స్థానిక ముస్లిం సమాజంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మజీద్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి సున్నతుల్ జమాత్‌కు చెందిన సుమారు 50 కుటుంబాల ప్రతినిధులు హాజరయ్యారు. మజీద్ భవిష్యత్ అభివృద్ధి, కమిటీ బాధ్యతలు, సామాజిక సేవా కార్యక్రమాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. అనంతరం గత రెండు కమిటీల కాలంలో విశేష సేవలు అందించిన ఎస్.కే. భాషా, ఎస్.కే. బషీర్‌ల నాయకత్వాన్ని కొనసాగించాలని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు ఎన్నికల ఫలితాల అనంతరం పలాస--కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన సున్నతుల్ జమాత్ కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలే ఈ విజయానికి కారణమని పేర్కొన్నాయి. రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ మజీద్‌తో పాటు ముస్లిం సమాజ అభ్యున్నతికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించాయి.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546